క్లుప్తంగా

36 మద్యం బాటిళ్లతో ఇద్దరు అరెస్ట్

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న బంటుపల్లి శ్రీనివాసరావు, తండ్యాల రమణను పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదుతో శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఆదివారం రాత్రి తనిఖీలు చేశారు. శ్రీనివాసరావు వద్ద 23 బాటిళ్లు, రమణ వద్ద 13 బాటిళ్లు పట్టుబడ్డాయి. నరసన్నపేట ఎస్ఐకి సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

విద్యుత్‌శాఖ ఏఈపై చర్యలు తీసుకోవాలి

పొందూరు: స్థానిక విద్యుత్‌శాఖ ఏఈ డి.రమణమూర్తిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ శాఖ ఉన్నతాధికారులకు మండలంలోని తాడివలస గ్రామానికి చెందిన సీపాన భాస్కరరావు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో పల్లె పండగలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డుకు అడ్డుగా ఉన్న 5 స్తంభాల మార్పునకు, 2 నూతన స్తంభాల ఏర్పాటుకు రూ.30 వేలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజులపాటు పనులు చేపట్టి 4 పాత స్తంభాలు మార్చారని, మిగిలిన పనిని రెండు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిగిలిన పనులను చేసేందుకు కూలీలు రావటం లేదని చెబుతున్నారని, లంచం డిమాండ్ చేస్తున్నారన్నారు. ఏఈపై చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఈకి ఫిర్యాదు చేశారు.

కామేశ్వరిపేటలో రైల్వే అధికారుల పర్యటన


గ్రామస్తులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

నరసన్నపేట: మండలంలోని కామేశ్వరిపేటలో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి రైల్వే అధికారులు సోమవారం పర్యటించారు. రైల్వే శాఖ కమర్షియల్ ఆఫీసర్ గణేష్ సాహు ఆధ్వర్యంలో విద్యుత్, సర్వే, సిగ్నలింగ్ అధికారులు వచ్చి పరిశీలించారు. గ్రామస్తులు చాలా కాలంగా కామేశ్వరిపేటలో అధికారికంగా రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం అనధికారికంగా పాసింజర్ ట్రైన్లు నిలుపుదల చేస్తున్నారు. దీనిని అధికారికం చేయాలని శ్రీకాకుళం ఎంపీ, కేంద్ర మంత్రి రామ్మోహనాయుడుకు గ్రామస్తులు ఇటీవల కోరారు. దీంతో రైల్వే అధికారులు వచ్చి పరిశీలన చేశారు. కామేశ్వరిపేటతోపాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలందరూ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రవల్లిక

బూర్జ: రహదారి ప్రమాదాల నివారణపై కొల్లివలస జంక్షన్‌లో స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక సోమవారం అవగాహన కల్పించారు. వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే దిచక్ర వాహనదారులకు అపరాధ రుసుం విధిస్తామన్నారు. పాలవలస జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీ సర్వే సక్రమంగా నిర్వహించాలి


ఆమదాలవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు/ఆమదాలవలస: రీ సర్వేను గ్రామాల్లో సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సోమవారం పొందూరు మండలంలోని కనిమెట్ట, ఆమదాలవలస మండలంలోని ఆనందపురంలో నిర్వహించిన రీసర్వే ప్రారంభోత్సవ ర్యాలీల్లో పాల్గొన్నారు. సాగునీటి వనరుల్లో ఆక్రమణలు తొలగించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలిస్తున్న డీఈ వెంకటప్పలనాయుడు

హిరమండలం: మేజర్ పంచాయతీ హిరమండలంలోని చిన్నకోరాడలో గల తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సి.హెచ్.వెంకటప్పలనాయుడు తెలిపారు. చిన్నకోరాడలో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను సోమవారం పరిశీలించారు. ఇంటింటికీ కుళాయిల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ పనులు మరో వారం రోజుల్లో పూర్తి చేసేందుకు కృషిచేయాలని గుత్తేదారునికి ఆదేశించారు. ఏఈ సాగర్, ఈఓ హరికృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖపై.. బకాయిల భారం

- పేరుకుపోతున్న ప్రభుత్వ శాఖల బిల్లులు
- నరసన్నపేటలోని కార్యాలయాల బకాయిలు రూ.కోటి పైనే
- మరోవైపు కార్యాలయాల్లో విద్యుత్ వృథా!


నరసన్నపేట విద్యుత్ సబ్ స్టేషన్

నరసన్నపేట: ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లుల బకాయిలు ఆ శాఖకు గుదిబండగా మారాయి. నెలవారీ బిల్లులు చెల్లించకపోవడంతో ఒక్కో కార్యాలయం నుంచి లక్షల్లో బకాయిలు ఉన్నాయి. బిల్లులు చెల్లించాలని విద్యుత్‌శాఖ అధికారులు స్థానిక అధికారులను విన్నవించుకుంటున్నా ఫలితం ఉండటం లేదు. ఒక్క నరసన్నపేట పట్టణంలోనే ప్రభుత్వ శాఖలు కట్టాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.రెండు కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నరసన్నపేట టౌన్‌లో వాటర్ వర్క్, వీధి దీపాల బిల్లులు అధికంగా ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి, పోలీస్ స్టేషన్, వసతి గృహాలు, అంగన్‌వాడీ భవనాలు, లుకలాం వాటర్ పంపింగ్ హౌస్, తహసీల్దార్ కార్యాలయం, సమితి కార్యాలయం, ప్రభుత్వ స్కూల్‌తో పాటు పలు శాఖలకు సంబంధించి విద్యుత్ బిల్లులు అధికంగా ఉన్నాయి. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, తామరాపల్లి రెసిడెన్సియల్ కళాశాల, తామరాపల్లి ఫారెస్ట్ కార్యాలయం ఇలా పలు శాఖల బిల్లులు వేలల్లో ఉన్నాయి. నియోజకవర్గంలోని జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. పలు కార్యాలయాల విద్యుత్ బిల్లులు లక్షల్లోనే ఉన్నాయి. నాలుగు మండలాల్లో విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.4 కోట్లకు పైబడి ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ శాఖల్లో విద్యుత్ బిల్లుల బకాయిల వివరాలు ఇలా

ప్రభుత్వ కార్యాలయం	బకాయి మొత్తం
నరసన్నపేట వాటర్ వర్క్, వీధి లైట్లు	రూ.70 లక్షలు
తహసీల్దార్ కార్యాలయం	రూ.12.47 లక్షలు
ప్రభుత్వ ఆస్పత్రి	రూ. 40 లక్షలు
స్కూల్స్	రూ.4.43 లక్షలు
తామరాపల్లి రెసిడెన్సియల్ కళాశాల	రూ.7.09 లక్షలు
వసతి గృహాలు	రూ.6 లక్షలు
అంగన్ వాడీ కేంద్రాలు	రూ.1.56 లక్షలు
ఏపీఎస్ఎఫ్ఎల్ (సీసీ కెమెరాలు)	రూ.4.75 లక్షలు
పంచాయతీ సమితి భవనం	రూ.92 వేలు
వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం	రూ.96 వేలు
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	రూ.81 వేలు

నిరంతర వెలుగులు..

వాడిన విద్యుత్ బిల్లులు కట్టకపోగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వృథా అధికంగానే ఉంటుంది. సమయం, సందర్భం లేకున్నా.. లైట్లు వెలుగుతుంటాయి. ఫ్యాన్లు తిరుగుతుంటాయి. కొన్ని కార్యాలయాల్లో ఏసీలు ఉన్నాయి. ఏమాత్రం విద్యుత్‌ను ఆదా చేయరు. ఎలాగూ బిల్లులు కట్టడం లేదు. ఒకవేళ కట్టినా ప్రభుత్వమే చూసుకుంటుందనే ధీమా కావచ్చు. గ్రామాల్లో వీధి దీపాలు లకిమేర, సోమవారంపేట, తదితర గ్రామాల్లో నిరంతరం వెలుగుతున్నాయి.

ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం

ప్రభుత్వ శాఖల విద్యుత్ బిల్లుల బకాయిలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తున్నాం. పైఅధికారులకు పంపించామని ఆయా శాఖల అధికారులు అంటున్నారు. ఇదే సమాచారం మా పైఅధికారులకూ అందజేస్తున్నాం. నరసన్నపేటలో అన్ని శాఖల బకాయిలు రూ.కోటిన్నర పైనే ఉన్నాయి.

– కోటేశ్వరరావు, ఏఈ, నరసన్నపేట టౌన్

రోడ్డు పక్కనే చెత్త



ఈ చిత్రం సారవకోట మండంలోని బుడితి గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం సమీపంలోని రోడ్డుకు పక్కనే ఉన్న చెత్త కుప్పలు. బుడితిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉంది. ఈ కేంద్రాన్ని గత ఏడాది గాంధీ జయంతి రోజు ప్రారంభించారు. దీనిని వినియోగించక పోవడంతో బద్రి నుంచి బుడితి వచ్చే రహదారి పక్కనే చెత్తను వేస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– సారవకోట

దిష్టి బొమ్మలా..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని స్కాట్‌పేటలో చుక్కనీరు రాని వీధి కుళాయి. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న మెగా రక్షిత తాగునీటి పథకం ద్వారా తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిల ద్వారా చుక్క నీరు రావటం లేదని కొమ్మువలస, మోదుగువలస కాలనీ, స్కాట్‌పేట తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కుళాయిలు వీధిలో దిష్టి బొమ్మల్లా ఉన్నాయన్నారు. వారానికి ఒక రోజు నీటి సరఫరా కావటం కష్టంగా ఉందన్నారు. అధికారులు స్పందించి ప్రతీరోజు ఉదయం, సాయంత్రం తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

రసాభాసగా గ్రామ సభ

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు గ్రామంలో ఉపాధి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభ రసాభాసగా మారింది. గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్డు, మురుగునీటి కాలువ నిర్మాణంపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పెద్దవీధిలోని రామ మందిరం నుంచి పైడి రామ్మూర్తి ఇంటివరకు 30 ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీని మూసివేసి.. కొత్తగా గ్రామం మధ్యలో ఊరు చివరకు మురుగునీటిని తరలించే ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా పనులు చేపట్టవద్దన్నారు. కొన్నిచోట్ల కావాలనే అధికారులు ఇళ్లను తొలగించారని సభ దృష్టికి తెచ్చారు. తమకు చెందిన స్థలాన్ని, కాలువ మురుగునీరు ప్రవహించే పొలం కలిగిన రైతుకే చెందినదిగా మండల సర్వేయర్ నిర్ధారణ చేయడంలో కచ్చితంగా వ్యవహరించలేదని గొండు రమణ, సింహాచలం, బిర్లంగి శ్రీరాములు, గొల్లపల్లి అప్పలనర్సమ్మ, పైడి గోపమ్మ, మామిడి జయలక్ష్మి, సింహాచలం ఆరోపించారు.


ఇరువర్గాల మధ్య వాగ్వాదం

ఈ సమయంలో ఇరువర్గాల మధ్య స్వల్ప వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. ఒక దశలో గ్రామసభలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ఎస్ఐ బి.హైమావతి తన సిబ్బందితో వచ్చి ఇరువర్గాలను అదుపుచేశారు. పెద్దవీధి సీసీరోడ్డుతో కూడిన మురుగునీటి కాలువ నిర్మాణంపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా సభను అర్థాంతరంగా ముగించారు. ప్రజలందరి సహకారం ఉంటేనే రహదారి, డ్రైనేజీ పనులు చేస్తామని, లేదంటే నిలుపుదల చేస్తామని సర్పంచ్ బిర్లంగి అమ్మయమ్మ ప్రకటించారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై ఫిర్యాదు

పొందూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం పక్కన ఉన్న సోషల్ క్లబ్ స్థలాన్ని తప్పుడు ధ్రువపత్రాలతో ఆక్రమించేందుకు ఓ వ్యక్తి ప్రయత్నిస్తున్నారని సోషల్ క్లబ్ ప్రతినిధులు సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రికార్డుల్లో 188 సర్వే నంబర్ పోరంబోకు స్థలంగా నమోదైందని, ఇదే నంబర్‌లో మండల పరిషత్ కార్యాలయంతోపాటు సోషల్ క్లబ్ భవనాలు ఉన్నాయన్నారు. 60 ఏళ్ల క్రితం సోషల్ క్లబ్ భవనం.. పోస్టుమార్టం కేంద్రంగా ఉండేదని, తరువాత ఈ భవనంలో సోషల్ క్లబ్ నడిచేదన్నారు. పంచాయతీకి సోషల్ క్లబ్ ప్రతినిధులు పన్నులు చెల్లించేవారన్నారు. సుమారు 19 సెంట్లలో ఉన్న ఈ క్లబ్ స్థలం ఖరీదు సుమారు రూ.3 కోట్లు వరకు ఉంటుందన్నారు. 2023లో ఆరుగురు వ్యక్తులతో ఫేక్ పొజిషన్ సర్టిఫికెట్ సంపాదించిన సదరు వ్యక్తి రిజిస్ట్రేషన్‌కు సిద్ధమయ్యాడన్నారు. భారీ లంచాలు చూపి అధికారులను, రిజిస్ట్రేషన్ అధికారులను కొనేందుకు ప్రయత్నించాడన్నారు. ఈ విషయం తెలియడంతో రెవెన్యూ రికార్డుల ఆధారాలతో పొందూరు పంచాయతీ ఈఓ మోహన్‌బాబుకు ఫిర్యాదు చేశామని సోషల్ క్లబ్ ప్రతినిధులు కోరుకొండ సాయికుమార్, మేదరమెట్ల సుందరరావు, తదితరులు తెలిపారు. తప్పుడు పత్రాలతో జరుగనున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడ్డుకుని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఈఓ మోహన్‌బాబుకు ఫిర్యాదు చేస్తున్న సోషల్ క్లబ్ ప్రతినిధులు

ఇంటి వద్దే జీవిత ధ్రువీకరణ

పొందూరు: అస్వస్థతతో కదలలేని స్థితిలో ఉన్న విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ పింఛన్‌దారుల ఇంటికే నేరుగా వెళ్లి వార్షిక జీవిత ధ్రువపత్రాలను స్వీకరించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల పొందూరు శాఖ సమావేశం నిర్ణయించింది. సోమవారం స్థానిక నవతా గ్రంథాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు అధ్యక్షత వహించారు. జీవిత ధ్రువీకరణకు సంబంధించి సంఘ కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాశరావు ఫోన్ 9441249793ను సంప్రదించాల్సి ఉంటుందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

సంఘ కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా నాళం పైడిరాజు, కార్యదర్శిగా సూర్యం, కోశాధికారిగా వాండ్రంగి దామోదరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా సి.హెచ్.ఆర్.కె.రంగారావు, గౌరవాధ్యక్షుడిగా దండా సూరిబాబు, కార్యవర్గ సభ్యులుగా ఆట్ల మణిభూషణరావు, పి.దివాకరపాత్రో, బి.జనార్ధనరావు, వై.గోపాలరావు, వి.రఘురావు, ఎం.రామకృష్ణ ఎన్నికయ్యారు.


తీర్మానం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పలు కుటుంబాలకు పరామర్శ

ఆమదాలవలస:

మున్సిపాలిటీ పరిధిలోని పలు కుటుంబాలను మాజీ శాసన సభాపతి, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం సోమవారం పరామర్శించారు. హట్కో కాలనీకి చెందిన అన్నెపు శ్రీరాములు (మేస్త్రి), అక్కివలసకు చెందిన సిమ్మ అప్పారావు, కృష్ణాపురం గ్రామానికి చెందిన కూన చంద్రశేఖర్, అలవెల్లి శారద, పొన్నాడ గోవిందరాజులు, తిమ్మాపురం గ్రామానికి చెందిన సిమ్మ రాజారావు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను పరామర్శించారి వారికి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.సత్యనారాయణ, మున్సిపల్ మాజీ వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్త విజయ్, పార్టీ నాయకులు అత్తులూరి రవికాంత్, సిమ్మ నాగరాజు, సాధు కామేశ్వరరావు, పొడుగు ముత్యాలు, కూన రామకృష్ణ, సంపతిరావు రామారావు, మెట్ట చక్రధర్ రావు, హేమంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


కృష్ణాపురంలో అలవెల్లి శారద కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం, నాయకులు

పాడి పరిశ్రమతో ఉపాధి

పోలాకి: ప్రస్తుత పరిస్థితుల్లో నాణ్యమైన పాడి ఉత్పత్తులకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో యువత ఉపాధి కోసం పాడి పరిశ్రమవైపు ఆలోచన చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే రమణమూర్తి పిలుపునిచ్చారు. మబగాంలో సోమవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వగ్రామంలో ఉపాధి మార్గాలను అన్వేషిస్తున్న యువ రైతులకు పాడి సంపద అదనపు ఆదాయాన్ని సమకూర్చుతుందన్నారు. ప్రభుత్వం గోశాలలను సబ్సిడీపై అందిస్తుందన్నారు. పశువైద్యాధికారి పద్మప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.


పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఆక్రమణలు అడ్డుకోవాలి

హిరమండలం: మండలంలోని తంపలో గల ఎస్సీ శ్మశాన వాటికకు సంబంధించిన స్థలం ఆక్రమణలకు గురవుతుందని, దీనిని రక్షించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్‌ను గ్రామస్తులు కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. తంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని స్థలాన్ని కూడా పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న తంప గ్రామస్తులు

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

హిరమండలం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అందజేస్తున్న ఆధార్ సేవలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఆర్‌కాశీప్రసాద్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో రెండు మొబైల్ ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు 23 గ్రామ పంచాయతీల్లో మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

నేత్ర చికిత్సలకు 30 మంది ఎంపిక


నేత్ర చికిత్సలకు ఎంపికైన రోగులు

పాతపట్నం: స్థానిక శివశంకర్ కాలనీ జంక్షన్‌లో జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ, శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 56 మందికి శంకర్ ఫౌండేషన్ వైద్యుడు శివప్రసాద్ కంటి పరీక్షలు చేశారు. 30 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశామని క్యాంప్ ఇన్‌చార్జి టి.రామారావు తెలిపారు.

పాలవలసకు ఘన నివాళి


పాలవలస రాజశేఖరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నరసన్నపేట: రాజకీయ కురువృద్ధుడు పాలవలస రాజశేఖరం మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సోమవారం పాలకొండలోని ఎమ్మెల్సీ విక్రాంతి ఇంటికి వెళ్లి రాజశేఖరం చిత్రపటానికి నివాళులర్పించారు. పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పరామర్శించారు. పార్టీ నాయకులు చింతు రామారావు, కేసీహెచ్‌బీ గుప్త, సదాశివుని కృష్ణ, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, బగ్గు రమణయ్య, దుల్ల రమణ, బొబ్బాది ఈశ్వరరావు, సతివాడ రామినాయుడు ఉన్నారు.

వీజీకే మూర్తి మృతి తీరనిలోటు


వీజీకే మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తూరు: సీపీఎం నేత వీజీకే మూర్తి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటుని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ అన్నారు. కొత్తూరులో సోమవారం వీజీకే మూర్తి సంతాప సభ నిర్వహించారు. వీజీకే చిత్రపటానికి పలువురు నేతలు నివాళులర్పించారు. ప్రసాదరావు మాట్లాడుతూ జిల్లాలో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడిగా, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, పలు పరిశ్రమల్లో కార్మిక సంఘాల నేతగా వీజీకే సేవలు అందించారన్నారు. వీజీకే చేసిన ప్రజాపోరాటలను గుర్తుచేశారు. పార్టీ నేతలు నిమ్మక అప్పన్న, సింహాచలం, కృష్ణ, తులసీరావు, తదితరులు పాల్గొన్నారు

పక్కాగా ఎల్సీడీసీ సర్వే

పోలాకి: ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించనున్న ఎల్సీడీసీ సర్వేను విజయవంతం చేయాలని పోలాకి ఆరోగ్య విస్తరణాధికారి నల్లి రవి కుమార్ సూచించారు. ప్రతి ఇంటికీ సర్వే బృందాలను పంపించి అనుమానాస్పదమైన మచ్చలు, స్పర్శలేని మచ్చలను గుర్తించాలన్నారు. కుష్ఠు నివారణ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎల్సీడీసీ సర్వే ద్వారా సంబంధిత వ్యక్తులకు ఉచితంగా మందుల పంపిణీ చేస్తామన్నారు. తొలిరోజు పోలాకి పీహెచ్‌సీ పరిధిలో 800 ఇళ్లను సర్వే చేశారు. ఉప కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షుల ఆధ్వర్యంలో సర్వే లక్ష్యాలను పూర్తిచేస్తామన్నారు.

జలుమూరు మండలంలో..

జలుమూరు: కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించే ఎల్సీడీసీ సర్వే ఇంటింటా పక్కాగా జరగాలని జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి చల్ల వంశీకృష్ణ అన్నారు. సోమవారం చల్లవానిపేటలో జరుగుతున్న ఎల్సీడీసీ సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనుమానిత కేసులను పరిశీలించి వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా మందులు ఇచ్చే వివరాలు కూడా తెలియజేయాలన్నారు. హెచ్ఎస్ చిన్న రాజులు, సిబ్బంది పాల్గొన్నారు.


జలుమూరు: చల్లవానిపేటలో సర్వేను పరిశీలిస్తున్న వైద్యాధికారి వంశీకృష్ణ

15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

ఆమదాలవలస: పురపాలక సంఘ అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,84,18,000 మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సోమవారం తెలిపారు. మొత్తం 18 వర్క్‌లకు పురపాలక సంఘానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల టైడ్, అన్‌టైడ్ నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు, గార్బేజ్ కాంపాక్టర్ వాహనం, తదితర వాటి కోసం రూ.53,64,389, నీటి సరఫరాను మెరుగుపర్చేందుకు నాగావళి నదిలోని కొత్తవలస వద్ద ఉన్న పంప్ హౌస్‌కు 40 కె.వి.ఎ జనరేటర్ కొనుగోలుకు, అలమాజీపేట వాటర్ పంప్ హౌస్‌కు, కొత్తవలస పంప్ హౌస్ బిల్డింగ్‌కు, ప్రహరీ నిర్మాణానికి రూ.27,21,311 మంజూరయ్యాయని తెలిపారు. పట్టణంలోని 15వ వార్డులో ఉన్న మోణింగివారి వీధిలో తారు రోడ్డు వేసేందుకు రూ.39,90,000, పురపాలక సంఘంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు రూ.63,42,956 మంజూరయ్యాయన్నారు. గతంలో పనులు మంజూరై, ఆ పనులు నిర్వహించకపోవడంతో ఈ నిధులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. ఆ నిధులు మళ్లీ మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించగా ప్రస్తుతం మంజూరు చేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

న్యాయం చేయాలని వినతి

మెళియాపుట్టి: ఆఫ్‌షోర్ కాలువకు భూములు ఇచ్చిన ప్రజలకు న్యాయం చేయాలని మండలంలోని అచ్చనాపురం గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ బడే పాపారావును కలిసి వినతిపత్రం అందించారు. నిర్వాసితులకు పరిహారాలు పూర్తిస్థాయిలో చెల్లించకుండా పనులు చేస్తున్నారని, తక్షణమే ఆపాలని కోరారు. 44 కుటుంబాలకు సంబంధించిన ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు సూచించారని, పరిహారాలు మాత్రం ఇవ్వలేదన్నారు. భూములు సేకరించిన వాటికి సైతం అతి తక్కువ పరిహారం ఇచ్చారన్నారు. ఇదే ప్రాజెక్ట్‌లో నిర్వాసితులైన దాసుపురం, చీపురుపల్లి గ్రామాలకు చెందిన వారికి ఆర్‌ఎండ్ఆర్ ప్యాకేజీని 2013 చట్టం ప్రకారం అందించారన్నారు. అచ్చనాపురం నిర్వాసితులకు మాత్రం తక్కువ పరిహారాలకు ఇవ్వడం అన్యాయమన్నారు. మరోసారి గ్రామాన్ని సందర్శించి, ప్యాకేజీల వివరాలు సమగ్రమంగా పరిశీలించి న్యాయం చేయాలని విన్నవించారు. డీ-పట్టా భూములకు ఎటువంటి పరిహారం అందించలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కూర్మారావు, సవర చొక్కారావు, ధర్మారావు, సవర సూరయ్య, సవర ఆనందరావు, సవర రామారావు, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అచ్చనాపురం గిరిజనులు